క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్‌లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.కె.ఉషశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కంప్యూటర్ సైన్స్ – 1, ఇంగ్లిష్ – 1 పోస్టులకు నియామకం జరపనున్నామని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో కనీసం 55 శాతం మార్కులతో పాటు, ఇంగ్లిష్, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీలు ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 31లోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు.

అధ్వానంగా గెడ్డలుప్పి - కొత్తవలస రహదారి



గెడ్డలుప్పి-కొత్తవలస రహదారి

సీతానగరం: మండలంలోని గెడ్డలుప్పి నుంచి కొత్తవలస, గెడ్డలుప్పి కాలనీకి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. వర్షం పడితే పాదచారులు సైతం కూడా ఆ మార్గంలో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ఆ మార్గంలో వెళ్తే ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట మరిన్ని కష్టాలు తప్పడం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి బాగుకు చర్యలు చేపట్టాలని ఆ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

మండల సమావేశం రేపు

పార్వతీపురం టౌన్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 27న నిర్వహించనున్నట్టు ఎంపీపీ మజ్జి శోభారాణి గురువారం తెలిపారు. ఎంపీడీఓ ఆకీబ్ జావేద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ఆగస్టు 2న మండల సర్వసభ్య సమావేశం

గుమ్మలక్ష్మీపురం: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఆగస్టు 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.రమేష్‌బాబు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

వాహనాల వేలం

పాలకొండ: వివిధ కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన వాహనాలకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. డీఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో ఎనిమిది ద్విచక్ర వాహనాలు, ఒక ఇండికా కారును వేలం వేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. వేలంలో వాహనాలు దక్కించుకున్న వారు ఆర్‌టీఓ కార్యాలయంలో సంబంధిత ధ్రువపత్రాలు పొందాలని తెలిపారు. సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో జైగురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ తదితర పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్.శర్మయాజీ ఆధ్వర్యంలో ఈ హోమాన్ని ఆలయ అర్చకులు శ్రీనివాసరావు భక్తులతో చేయించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. బాబా దర్శనానికి గరుగుబిల్లి, పెద్దూరు, హిక్కింవలస, రావుపల్లి, బీవీ పురం, కొత్తపల్లి గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో విచ్చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

సీతంపేట: మండలంలోని కె.బంబడుగూడ జీపీఎస్ పాఠశాలను సీఎంఓ చిరంజీవులు గురువారం సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ... బోధన, మౌలిక వసతులపై అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్, ఇన్వర్టర్ వితరణ

కురుపాం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విశాఖపట్నానికి చెందిన మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి వారు రూ.లక్ష విలువైన ల్యాప్‌టాప్, ప్రింటర్, ఇన్వర్టర్‌ను వితరణ చేశారు. వీటిని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ ప్రధానోపాధ్యాయుడు తోట శంకరరావుకు గురువారం అందజేశారు. కురుపాం గ్రామాన్ని దత్తత తీసుకున్న నేపథ్యంలో గతంలో వైద్యశిబిరాలు నిర్వహించి, ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించామని, ఇప్పుడు పాఠశాలకు సాయం చేయడం కూడా సంతోషంగా ఉందని ఆస్పత్రి ఎండీ మురళీకృష్ణ అన్నారు. తన తండ్రి డాక్టర్ సీతారామస్వామి ఇదే పాఠశాల పూర్వ విద్యార్థి కావడంతోనే ఈ పాఠశాల అభివృద్ధిపై తమకు మక్కువన్నారు. కార్యక్రమంలో విశాఖ ఈస్ట్ క్రైమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సొండి ఆదాం తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారాల్లో నైపుణ్యతతో మంచి ఉపాధి

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: వ్యాపార నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా మంచిగా ఉపాధి పొందవచ్చని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. నైపుణ్యాలతో అద్భుతమైన అవకాశాలు వస్తాయని, పలువురికి ఉపాధి కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆశా దీపాలుగా నిలవగలరన్నారు. ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా పరిశ్రమల సంస్థ, నాబార్డు తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, ఇతర రంగాలను విభజించి వాటి వివరాలు క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. అర్హత, వనరులు ఉన్న అభ్యర్థులకు రుణాల మంజూరులో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ స్వంత కాళ్ల మీద నిలబడాలి అనేది ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇందుకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగితే పలువురికి ఉపాధి అవకాశాలు వస్తాయని ఆయన అన్నారు. ఔత్సాహికుల నుంచి ప్రతి నెల దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వ్యాపార నైపుణ్యాలు పెంచుకోవాలని ఆయన సూచించారు. కోటి రూపాయల వరకు రుణాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్, నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ దినేష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ బీబీ సాహు, ఖాదీ పరిశ్రమల బోర్డు అభివృద్ధి అధికారి రవికుమార్, ఔత్సాహికులు పాల్గొన్నారు.

బంగారు భవితకు బాటలు వేయాలి

పార్వతీపురం టౌన్: విద్యార్థి దశ నుంచే ఆసక్తి గల రంగాల్లో విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాలు ఏర్పాటు చేసుకొని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. శిక్షా సప్తాహ విద్యా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమన్నారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, లలిత కళలు వంటి రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలని విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఆరోగ్యం కోసం మంచి ఆహార అలవాట్లు, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రక్తహీనత లోపం తలెత్తకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నారు. వేడుకల నిర్వహణపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

సచివాలయాల్లో ఆధార్ సీడింగ్



జోగింపేటలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరరావు

సీతానగరం: మండలంలోని గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ నంబర్ల మార్పులు చేర్పులను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు అన్నారు. జోగింపేట సచివాలయంలో డిజిటల్, వీఆర్‌ఓలు పర్యవేక్షణలో జరుగుతున్న ఆధార్ సంబంధిత పనులను ఎంపీడీఓ ఈశ్వరరావు, ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఈశ్వరరావు మాట్లాడుతూ గతంలో ప్రజలకు సమకూర్చిన ఆధార్ కార్డుల్లో పేర్లు తప్పులు దొర్లడం, ఫోన్ నంబర్లు అనుసంధానం చేయకపోవడం, చిరునామాలు మార్పు తదితర సంబంధిత మార్పులు చేయడం జరుగుతున్నారు. సచివాలయాల్లోనే ఈ మార్పులు చేస్తున్నారని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థులకు ఆరోగ్య భద్రత కల్పించాలి

పార్వతీపురం టౌన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య భద్రత కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.అఖిల్ అన్నారు. మండల పరిధిలోని రావికోన గ్రామంలో ఆశ్రమ పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యా సంస్థలో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందడంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబానికి ప్రభుత్వం రూ.పది లక్షలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలకు, కళాశాల వసతిగృహాలకు గతంలో పని చేసిన ఆదివాసి ఆరోగ్య సిబ్బందిని నియమించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, గిరిజన విద్యా సంస్థల్లో రెగ్యులర్‌గా ఆరోగ్య తనిఖీలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట గిరిజన సంఘాల నాయకులు ఉన్నారు.

మక్కువ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



మక్కువ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

మక్కువ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. సీఆర్‌పీఎఫ్ బ్యారెక్స్ క్వార్టర్లను, ఏపీఎస్పీ సెంట్రీహౌస్‌ను ఎస్పీ పరిశీలించారు. సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ అధికారులతో మాట్లాడారు. ఏవోబీ సమీపంలో మక్కువ పోలీస్‌స్టేషన్ ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ఏరియా డామినేషన్ నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. విధుల నిర్వహణపైపోలీస్ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు: పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ మాధవరెడ్డి గురువారం పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన ఆయన రికార్డులను తనిఖీ చేశారు. శాంతిభద్రతల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. సిబ్బందితో మాట్లాడారు.

కేంద్ర బడ్జెట్ నిరాశజనకం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

సాలూరు: కేంద్ర బడ్జెట్ నిరాజనకంగా ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ మాటలు ఫుల్ రాష్ట్రానికి నిధులు నిల్‌గా ఉందని విమర్శించారు. ప్రజలపై భారాలు వేసిన బడ్జెట్‌కి వ్యతిరేకంగా నిరసన తెలపాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఊసే లేదని, రైల్వే జోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్య సంస్థలు తదితర చట్టబద్ధమైన హామీలకు బడ్జెట్‌లో చోటు దక్కలేదన్నారు. గిరిజన యూనివర్సిటీ గిరిజన మండలంలోనే ఏర్పాటు చేయాలని పార్టీ మండల కమిటి తీర్మానం చేసింది. సమావేశంలో నాయకులు మర్రి శ్రీనివాసరావు, సీదరపు అప్పారావు, గెమ్మెల జానకిరావు, వంతల సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

దళితుల నిరాహార దీక్షలకు ఎస్ఎఫ్ఐ మద్దతు



రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపిన ఎస్ఎఫ్ఐ నాయకులు

పార్వతీపురం టౌన్: కలెక్టర్ కార్యాలయం ఎదుట పది రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్న శివ్వాం దళితులకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పండు గురువారం మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ్వాంలో దళితులకు డి పట్టాలిచ్చి 50 సంవత్సరాలవుతున్న దానిపై నకిలీ ఇంజక్షన్ సూటు కోర్టును తప్పుదోవ పట్టించి తెచ్చిన పెత్తందారులు దళితులు సాగు చేస్తున్న భూమిపైకి వెళ్లి దళితులపై దాడి చేశారని, దీన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు శివ్వాం దళితుల భూమి దళితులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. శివ్వాం దళితులపై దాడి చేసి తిట్టి కొట్టిన పెత్తందారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి పోలీసులు అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొల్లి గంగునాయుడు, రెడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భామిని : మండలంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో గల రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో జంగిల్ క్లియరెన్స్, లైన్ల నిర్వహణ పనుల నేపథ్యంలో సరఫరానిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీతంపేట: మండలంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ జి.నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు జరుగుతున్నందున సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్త్రీలకు రక్షణ కల్పించాలి



మక్కువలో మానవహారం నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

మక్కువ: ఆడపిల్లలపై ఇటీవల అఘాయిత్యాలు ఎక్కువవుతున్నందున, ప్రభుత్వం ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. మండల కేంద్రం మక్కువలో స్త్రీలకు రక్షణ కల్పించాలంటూ ఏఐఎస్ఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ప్రధాన వీధులలో గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మూడురోడ్ల కూడలి వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ చిన్నపిల్లల నుండి, పెద్దవాళ్ల వరకు స్త్రీలపై యాసిడ్ దాడులు, అత్యాచారాలు ఆగడం లేదన్నారు. మద్యం, డ్రగ్స్‌ను నియంత్రించకపోవడంతో దాడులు జరుగుతున్నాయన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో, రాష్ట్రంలో దాడులు మరింతగా పెరిగిపోయాయన్నారు. అత్యాచారాలు, దాడులకు పాల్పడుతున్న వ్యక్తులను కఠినంగా శిక్షించి, బాధితులను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ హరికృష్ణ, మండల నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎంవీఐ సత్యనారాయణ

కురుపాం: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పార్వతీపురం మన్యం జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సూచించారు. మండల కేంద్రం పరిధిలోని పి.లేవిడి జంక్షన్ వద్ద సేఫ్టీ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్ వెంట తీసుకురావాలని, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని, పరిమితికి మించి వాహనాల్లో ఎక్కించరాదన్నారు. అలాగే మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

పశు వ్యాధులపై తస్మాత్..



దూడకు వైద్యసేవలందిస్తున్న పశువైద్యాధికారిణి కావ్యశ్రీ

సీతానగరం: వర్షాలు కురుస్తున్న కారణంగా పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు, గొర్రె కాపరులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని 1962 పశువైద్యాధికారిణి డాక్టర్ ఎం.కావ్యశ్రీ అన్నారు. అప్పయ్యపేటలో వ్యాధుల బారిన పడిన పశువులను సంచార వైద్య కేంద్రం ద్వారా సీతానగరం పశువైద్య కేంద్రానికి తరలించి పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సీహెచ్ దీనకుమార్ పర్యవేక్షణలో వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కావ్యశ్రీ మాట్లాడుతూ పశువులు ఆస్పత్రికి రాలేని సమయంలో 1962 సంచార పశువైద్యం ద్వారా గ్రామాల్లో పశువుల పాకల్లో ఉచితంగా వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 1962 ఫోన్ నంబరుకు సమాచారం ఇచ్చిన అర్ధ గంటలో సిబ్బంది చేరుకుంటామని, ఈ అవకాశాన్ని రైతులు, గొర్రెల కాపరులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో 1962 అసిస్టెంట్ గాయత్రి, తిరుపతిరావు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలు పాటించాలి



కృష్ణారాయపురంలో మలాథియాన్ స్ప్రే చేయిస్తున్న కార్యదర్శి

సీతానగరం: పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాలను పాటించి పారిశుద్ధ్యం మెరుగుపడేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ అన్నారు. మండలంలోని కృష్ణారాయపురం, పెదబోగిలి, సూరంపేట, జోగింపేట గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ చర్యలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు పర్యవేక్షణలో పలు గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులు చేపట్టాలి



పాడైన రహదారి వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఎంఎల్ పార్టీ శ్రేణులు

పార్వతీపురం టౌన్: రోడ్లు మరమ్మతులు చేపట్టాలని సీపీఎంఎల్ పార్టీ కన్వీనర్ జిల్లా కార్యదర్శి పి.సంఘం అన్నారు. మండలంలోని ఎమ్మార్ నగరం పంచాయతీ గ్రామ సమీపంలో రోడ్లు పూర్తిగా గోతులతో అధ్వానంగా ఉండటంతో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్వాన రోడ్లుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు బాగోలేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు మీద వెళ్లే ప్రతి ఒక వాహనం దగ్గర రోడ్ ట్యాక్స్ ముక్కు పిండి వసూలు చేస్తున్నారన్నారు. ఆ డబ్బులు ఏం చేస్తున్నారు? ప్రజల ప్రయోజనాల కోసమా.. లేదంటే మీ జేబులు నింపుకోవడం కోసమా? అని ప్రశ్నించారు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిందని ఇప్పటికైనా చంద్రబాబునాయుడు రోడ్లు బాగు చేసి ప్రజల ప్రాణాలను కాపాడతారని కోరుతున్నామన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర ఎన్నికల ముందు మండలంలోని గ్రామ పంచాయతీలకు తిరిగారు, అలాగే ఇప్పుడు కూడా ప్రతి మండలం పంచాయతీ గ్రామంలో తిరిగి రోడ్లు బాగుచేస్తారని అభివృద్ధి చేస్తారని కోరుతున్నామన్నారు. లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జి.దుర్గారావు ఎం.నవీన్, జి.అభి, ఎం.రాజు, పి.కిరణ్, జె.ప్రసాద్, పి.వినయ, పి.గౌరీ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు న్యాయం చేయండి



డీడీ రుక్మాంగదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంక్షేమ సంఘం నాయకులు

పార్వతీపురం టౌన్: ఏకవల్యలో ఉపాధి కోల్పోయిన గిరిజన కార్యాలయ సిబ్బందికి న్యాయం చేయాలని గిరిజన సంఘాల నాయకుడు పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ డీడీ రుక్మాంగదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకలవ్య రెగ్యులర్ నియామకాల్లో భాగంగా ఉపాధి కోల్పోయిన వారిలో కేవలం ఇద్దరు గిరిజనేతరులకు మాత్రమే నియామకం ఉత్తర్వులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఇదేనా గిరిజన సంక్షేమం అని ప్రశ్నించారు. ఉపాధి అవకాశాలు కోల్పోయిన అభ్యర్థులు మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పల్ల సురేష్, ఇంటికుప్పల రామకృష్ణ, ఆరిక చంద్రశేఖర్, రొబ్బ లోవరాజు, ఉపాధి కోల్పోయిన గిరిజన అభ్యర్థులు రాజశేఖర్, లావణ్య, బంగారమ్మ ఉన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పార్వతీపురం టౌన్: జిల్లాలో ఉన్న ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం కల్పించుకొని బకాయి పడ్డ గౌరవ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వ్యవసాయ కార్మికులు రైతులను చైతన్య పరుస్తూ నిరంతరం పని చేస్తున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారికి ప్రమాద బీమా చేయాలని, టీఏ, డీఏలు ఇతర అలవెన్సులు హెచ్‌ఆర్‌ఏ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పిస్తూ తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వి.ఇందిరా, కోశాధికారి జి.వెంకటరమణ, సూరిబాబు, జిల్లా కమిటీ ప్రతినిధులు ప్రసాదు, సురేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆ రోడ్డుపై ప్రయాణం నరకమే..!



బిల్లుమడ వద్ద గోతిలో దిగబడిన లారీ



లారీని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న జేసీబీలు

భామిని : మండలంలోని ఏబీ రోడ్డు మరీ దారుణంగా తయారైంది. రోడ్డు మొత్తం గోతులతో నిండిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా ఈ రోడ్డుపై వివిధ రాష్ట్రాలకు చెందిన భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతిరోజూ వాహనాలు గుంతల్లో కూరుకుపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. బిల్లుమడ – గురండి మధ్య గురువారం ఒడిశా నుంచి వస్తున్న భారీ ఇసుక లారీ గుంతలో దిగబడిపోయింది. దీంతో రెండు జేసీబీలను తీసుకువచ్చి గంటల తరబడి ప్రయత్నించగా.. ఎట్టకేలకు లారీ బయటకు వచ్చింది. ప్రతి రోజూ ఎక్కడో చోటా ట్రాఫిక్ స్తంభించిపోతుండడంతో ఈ రోడ్డుపై రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడాల్సి వస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా సుమారు 50 టన్నుల బరువుతో వాహనాలు రాకపోకలు సాగించడం వల్ల రోడ్డు త్వరగా పాడైపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టడంతో పాటు భారీ వాహనాల రాకపోకలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

కొమరాడ: పార్వతీపురం-కూనేరు అంతర్‌రాష్ట్ర రహదారిలో గురువారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రోడ్డులో ఏర్పడిన భారీ గుంతల్లో అటువైపుగా వెళ్లిన ఓ భారీ లారీ దిగబడిపోవడంతో రోడ్డుకు ఇరువైపులా వచ్చిన చాలా వాహనాలు అలాగే నిలిచిపోవాల్సి వచ్చింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరారు.